# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అరుణాచల్ ప్రదేశ్‌లో 6 వందల అడుగుల హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు.**
2. **పర్యాటక కేంద్రాల్లో ఆంధ్రప్రదేశ్ హస్తకళలు, ఉత్పత్తులకు ప్రచారం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
3. **తక్కువ ఖర్చుతో అంతరిక్ష పరిశోధనలు చేస్తూ భారత్ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.**
4. **ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు కృష్ణాజిల్లా గుడివాడలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**
5. **తెలంగాణలో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి నిర్వహించిన డీఎస్సీ పరీక్ష ప్రాథమిక కీ విడుదలైంది.**

==========================

హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిన్న అరుణాచల్ ప్రదేశ్‌లో 6 వందల అడుగుల తిరంగా యాత్ర నిర్వహించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. అరుణాచల్ ప్రదేశ్ ప్రజల హృదయాల్లో దేశభక్తి లోతుగా పాతుకుపోయిందని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. హర్ ఘర్ తిరంగా అభియాన్ పట్ల ఇంతటి ఉత్సాహాన్ని చూడటం ఆనందంగా ఉందని తెలిపారు. మరోవైపు గుజరాత్ లోని అహ్మదాబాద్‌లో తిరంగా యాత్రను హోమ్ మంత్రి అమిత్ షా నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం అనే దృక్పథాన్ని తిరంగ యాత్ర సాకారం చేస్తుందన్నారు. ప్రజలు తమ నివాసాలు, కార్యాలయాల వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

హర్ ఘర్ తిరంగా వాయిస్ (26 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగం అభివృద్ధికి కేంద్రం అందించే 300 కోట్ల రూపాయలతో శ్రీశైలం, రాజమహేంద్రవరం, గోదావరి ప్రాంతం, సూర్యలంక బీచ్‌లో పర్యాటక ప్రాజెక్టుల పనులు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.. నిన్న అమరావతిలో పర్యాటక శాఖపై నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పర్యావరణహిత, దేవాలయ, బీచ్ పర్యాటక అభివృద్ధికి పుష్కలమైన

అవకాశాలున్నాయన్నారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న పర్యాటక విధానాలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా కొత్త పర్యాటక పాలసీ తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళలు, చేనేత, గిరిజన ఉత్పత్తులకు పర్యాటక కేంద్రాల్లో ప్రచారం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

తక్కువ ఖర్చుతో అంతరిక్ష పరిశోధనలు చేస్తూ భారత్ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం షార్‌లో జరుగుతున్న జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమంలో నిన్న ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, శాస్త్ర సాంకేతిక రంగంలో భారత శాస్త్రవేత్తలు దేశానికి అందిస్తున్న సేవలు ఎనలేనివని అన్నారు. ప్రధానమంత్రి ఆధ్వర్యంలో భారత అంతరిక్ష కేంద్రం ఆత్మ నిర్భర్ దిశగా సాగుతోందని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు కృష్ణాజిల్లా గుడివాడలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నిన్న గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఆత్మకూరులోని అక్షయపాత్ర వంటశాలను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్‌లకు ఆహార పంపిణీ ఏర్పాట్లను పరిశీలించినట్టు చెప్పారు. అన్న క్యాంటీన్‌లకు ఆహార పంపిణీ కాంట్రాక్టు అక్షయపాత్ర నిర్వహిస్తోందని మంత్రి పేర్కొంటూ...

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

తెలంగాణలో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి నిర్వహించిన డీఎస్సీ పరీక్ష ప్రాథమిక కీ నిన్న విడుదలైంది. పాఠశాల అసిస్టెంట్, భాష పండిట్, సెకెండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి వేర్వేరుగా జవాబుల కీ తోపాటు, రెస్పాన్స్‌షీట్లను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. అభ్యర్థులు కీపై అభ్యంతరాలను ఈనెల 20వ తేదీ వరకు తెలపవచ్చని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తెలిపారు.

---------------------------

దేశ విభజన సమయంలో జరిగిన ప్రజల విషాదాన్ని బాధలను గుర్తు చేసుకుంటూ ప్రతి యేటా ఆగష్టు 14ను విభజన విషాద స్మృతి దినంగా జరుపుకుం టున్నాం.దేశ విభజన బాధను ఎప్పటికీ మరిచిపోలేం. విద్వేషం, హింస కారణంగా లక్షల మంది నిర్వాసితులు కావడంతోపాటు, ప్రాణాలు కోల్పోయారు. వారి సంఘర్షణ, త్యాగాలను గుర్తు చేసుకుంటూ విభజన విషాద స్మృతి దినంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.

---------------------------

వాతావరణ సమతుల్యతను కాపాడుకోవడం కోసం విరివిగా మొక్కలను నాటాల్సిన అవసరముందని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆఫ్ ఇండియా గుంటూరు క్షేత్ర అధికారి ఆర్ రమేశ్చంద్ర పేర్కొన్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గుంటూరులోని విజ్ఞాన్ నిరులా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ విద్యా సంస్థలో ఏక్ పేడ్, మా కే నామ్, అమ్మ పేరిట ఒక మొక్క

కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల నేషనల్ క్యాడెట్ కోర్ ఎన్.సి.సి. వాలంటీర్లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రమేశ్చంద్ర మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులను కాపాడుకునే బాధ్యత దేశ పౌరుల చేతిలో ఉందని అన్నారు. వాతావరణ సమతుల్యత, పెరుగుతున్న ఉష్ణోగ్రతలనుంచి రక్షణ, భూసార రక్షణకు మొక్కలు ప్రాధమికంగా ఉపయోగపడతాయని తెలిపారు.

ఇలా ఉండగా ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం పై ఆకాశవాణి, విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక ముఖాముఖి ఈ రోజు ఉదయం 10 లకు ప్రసారమవుతుంది.

---------------------------

తెలంగాణలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన మాట్లాడుతూ కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నామని చెప్పారు. వసతి గృహాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ట్యాంకులు శుభ్రం చేయాలని, తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వైద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో విద్యార్థులకు హిమోగ్లోబిన్, విటమిన్ పరీక్షలను నిర్వహించాలని మంత్రి అధికారులకు సూచించారు.

---------------------------

రాయలసీమ నుంచి తమిళనాడులోని కొమోరిన్ ప్రాంతం వరకు సముద్రమట్టానికి 0.9 కి.మీ ఎత్తులో ద్రోణి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది దీని ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. రాయలసీమలో భారీ వర్షాలు, కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని సూచించింది.

మరోవైపు తెలంగాణలోనూ రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలుజిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని తెలిపింది.

---------------------------

తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ మహిళల భాగస్వా మ్యంతో స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క అధికారులకు సూచించారు. నిన్న హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి దృశ్య మాధ్యమం ద్వారా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం, స్వయం సహాయక సంఘాలు వంటి అంశాలపై జిల్లా పంచాయతి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.

=====================